సాక్షి
వికారాబాద్
శుక్రవారం ౹ 30 ౹ ఆగస్టు ౹ 2024



'బంగారు' రుణాలు

బంగారమంటే మహిళలకు మక్కువ. అత్యవసర సమయంలో ఆదుకుంటుందని పసిడిని కొనుగోలు చేస్తున్నారు. 8లో▸



'కోట్‌పల్లి'కి వరద ప్రవాహం

కోట్‌పల్లి ప్రాజెక్టుకు వరద ప్రవాహం క్రమంగా చేరుతోంది. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



కురుమల సంక్షేమానికి కృషి

కురుమల సంక్షేమానికి కలిసి పని చేద్దామని ఆ సంఘం తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు నాగారం జగదీశ్వర్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం చౌడాపూర్ మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను అమలు చేసి తీరుతామని పేర్కొన్నారు. పార్టీ కోసం పని చేసే నాయకులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి



రుణమాఫీ కాని రైతుల వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

అనంతగిరి: రైతులందరికీ రుణమాఫీ అమలవుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్ మండలం పీరంపల్లిలో మండల వ్యవసాయ అధికారులు రుణమాఫీ కాని రైతు కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు గురించి ఏఈఓ జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీపై ఎలాంటి సందేహాలు ఉన్నా గ్రామాలకు వచ్చే వ్యవసాయాధికారులకు కలిసి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రుక్మిణి, ఏఈఓ కావ్య రైతులు పాల్గొన్నారు.

బురదలో దిగబడిన ఆర్టీసీ బస్సు



ధారూరు: ధారూరు ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని బురదలో గురువారం డీలక్స్ బస్సు దిగబడింది. దాన్ని బయటకు తీసేందుకు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో డ్రైవర్ తాండూరు ఆర్టీసీ అధికారికి సమాచారం ఇచ్చారు. ప్రయాణికులను మరో బస్సులో పంపించారు. తాండూరు - హైదరాబాద్ డీలక్స్ బస్సు సాయంత్రం ధారూరు బస్టాండుకు వచ్చింది. ఇటీవల బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు నిలవకుండా మట్టిని పోశారు. వర్షాలకు మట్టి బురదగా మారింది. డ్రైవర్ గమనించకుండా అందులోకి తీసుకెళ్లి బస్సును ఆపాడు. దీంతో బురదలో కూరుకుపోయింది. ఎంత ప్రయత్నించినా బస్సు బయటకు రాలేదు. తాండూరు డిపో అధికారికి సమాచారం ఇవ్వడంతో వారు మరో బస్సును పంపారు.

నక్షా రోడ్డును ఆక్రమించారని ఆందోళన

ఇబ్రహీంపట్నం రూరల్: నక్షా రోడ్డును రియల్టర్లు కబ్జా చేశారని రైతులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. కొంగరకలాన్‌లోని దేవరకొండ నక్షా రోడ్డును రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జా చేసిందని, తమ భూముల్లోకి వెళ్లకుండా గోడలు కట్టి భయభ్రాంతులకు గురి చేస్తోందని రైతులు వాపోయారు. సర్వే నంబర్ 41,61లో దేవరకొండ నక్షా రోడ్డును 15 ఫీట్లతో ఏర్పాటు చేసుకుంటే పక్కనే ఉన్న రియల్ ఎస్టేట్ సంస్థ ఆక్రమించిందని ఆరోపించారు. కొంగరకలాన్ శ్లోక ఫంక్షన్ హాల్ నుంచి నారాయణ స్కూల్ వరకు రోడ్డు వేసుకుని తమ భూముల్లోకి వెళ్లేవారమని చెప్పారు. సదరు రియల్ ఎస్టేట్ సంస్థ తమ భూముల్లోకి వెళ్లనీయడం లేదని ధర్నాకు దిగారు. ధర్నా చేస్తున్న తమను బౌన్సర్లను పెట్టి అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకటేశ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు పట్టించుకోవడం లేదని రైతులు నిలదీశారు. ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హామీ ఇచ్చారు. కాగా, రియల్ ఎస్టేట్‌సంస్థ యాజమాన్యం మాత్రం తాము ఎవరి భూములు, రోడ్లు ఆక్రమించలేదని చెబుతోంది.

శివసాగర్ ప్రాజెక్టు నీటిలో అక్రమార్కులు వేసిన ఫెన్సింగ్



చెరవులు

జిల్లాలో యథేచ్ఛగా చెరువుల కబ్జా

- వికారాబాద్ పరిధిలోని మూడు చెరువుల్లో ఆక్రమణలు
- తాండూరులో సగానికి పైగా అన్యాక్రాంతమైన గొల్ల చెరువు
- పరిగిలో కొత్త చెరువు పూర్తిగా మాయం
- మరో చెరువుదీ ఇదే పరిస్థితి
- పట్టించుకోని రెవెన్యూ శాఖ

వికారాబాద్: హైదరాబాద్‌లో చెరువుల కబ్జాపై హైడ్రా హడలెత్తిస్తున్నా జిల్లాలో మాత్రం ఆ ఊసే లేదు. మున్సిపాలిటీల్లో చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతోనే అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మూడు చెరువులు కబ్జాకు గురయ్యాయి. తాండూరు మున్సిపల్ పరిధిలో ఒకటి, పరిగి మున్సిపల్ పరిధిలో రెండు చెరువులు కబ్జాకు గురయ్యాయి.

శివసాగర్ చుట్టూ కబ్జాలే..

మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఏదైనా సమస్య తలెత్తితే వికారాబాద్‌కు తాగునీటి అవసరాలు తీర్చే ఏకైక ప్రత్యామ్నాయం శివసాగర్ మాత్రమే. ఈ చెరువు సామర్థ్యం 2.25 క్యూబిక్ మిలియన్ లీటర్లు. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న ఈ చెరువు రోజుకో చోట కబ్జాకు గురవుతోంది. విషయం అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. శివసాగర్‌కు నాలుగు వైపులా ఆక్రమణలు జరుగుతున్నాయి. కొందరు బడా బాబులు చెరువును కబ్జా చేసి ఫాంహౌస్‌లు నిర్మిస్తుండగా.. మరికొందరు చెరువు చివరి భాగాన్ని పూడ్చి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. 65వేల జనాభా కలిగిన వికారాబాద్ పట్టణానికి ప్రధాన తాగునీటి వనరు అయిన ఈ చెరువును కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మిగతా చెరువులదీ ఇదే కథ

వికారాబాద్ పరిధిలోని కొత్తగడి సమీపంలో ఉన్న కొంపల్లి చెరువు పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిస్థితీ ఇలాగే ఉంది. కొందరు వ్యాపారులు చెరువు తోపాటు బఫర్ జోన్‌ను పూర్తిగా కబ్జా చేశారు. వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు స్థలంలో కాటేజీలు నిర్మించి అద్దెకు ఇస్తున్నారు. పరిగి మున్సిపల్ పరిధిలోని కొత్త చెరువు పూర్తిగా అన్యాక్రాంతమైంది. అందులోకి నీరు చేరకుండా ఫీడర్ చానల్‌ను దారి మళ్లించారు. తూములు ధ్వంసం చేశారు. చెరువు, కట్టను ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. పరిగిలోని పల్లవి కళాశాల వెనక గల చెరువు కూడా పూర్తిగా ఆక్రమణకు గురైంది. తాండూరు మున్సిపల్ పరిధిలోని గొల్ల చెరువును సగానికి పైగా కబ్జా చేశారు. ఇటీవల బీజేపీ నాయకులు చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు.

అందరూ పాత్రధారులే..

చెరువుల కబ్జాలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాత్రధారులుగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నియోజకవర్గ ముఖ్య నేతల కనుసన్నల్లోనే కబ్జా చేస్తూ వెంచర్లు వేస్తున్నారని పలువురు అంటున్నారు. చెరువులతో పాటు చుట్టు పక్కల గల అసైన్డ్ భూములను ఆక్రమించి వెంచర్లలో కలుపుకొని విక్రయిస్తున్నట్లు తెలిసింది. చెరువులను కబ్జా చేసి కోట్ల రూపాయలు సంపాదిస్తున్న రియల్టర్లు, కబ్జాదారులు నేతలకు, అధికారులు పర్సెంటేజీలు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నోటీసులిచ్చాం

సర్పన్‌పల్లి ప్రాజెక్టు బఫర్ జోన్‌లో నిర్మించిన కాటేజీలను తొలగించాలని వాటి యజమానులకు నోటీసులు ఇచ్చాం. వారు తొలగించకుంటే మేమే చర్యలు తీసుకుంటాం. మిగతా చెరువులను పరిశీలించి ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం.

– సుందర్, నీటిపారుదల శాఖ ఈఈ

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి: పాఠశాలల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పరిగి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ చదువుతోపాటు ఏదో ఒక ఆటను ఎంచుకుని అందులో ప్రతిభ కనబరచాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పొందవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి పాఠశాలలో క్రీడల కోసం ప్రత్యేక సమయం కేటాయించాలన్నారు. ఆటల్లో రాణించడం ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రత్యేక కోటా ఉంటుందన్నారు. అంతేకాకుండా సమాజంలో మంచి గుర్తింపు, పేరు ప్రతిష్ఠలు వస్తాయని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. విద్యార్థులు ఆటల్లో రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి హన్మంత్‌రావు, తహసీల్దార్ ఆనంద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేయండి

అనంతగిరి: నిర్ణీత గడువులోగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎన్నికల అధికారులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. మండలాల వారీగా ఎంత మంది ఓటర్లు ఉన్నారు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎంత మంది, మహిళలు, పురుషుల వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీఓ వాసుచంద్ర, ఇన్‌చార్జి డీపీఓ సంధ్యారాణి, డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు



యాప్‌లో నమోదు చేసేందుకు రైతు కుటుంబంతో సెల్ఫీ తీసుకుంటున్న అధికారి

మాఫీపై భరోసా

- రుణమాఫీపై ప్రభుత్వం దృష్టి
- అర్హులందరికీ వర్తింపజేస్తామని హామీ
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా యాప్
- క్షేత్రస్థాయిలో రైతుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

షాద్‌నగర్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతిష్టాత్మకంగా రుణమాఫీ పథకాన్ని చేపట్టింది. వివిధ కారణాలతో పలువురు రైతులకు మాఫీ కాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని.. అర్హులందరికీ రుణమాఫీ అవుతుందని ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ఈ మేరకు సమస్యలు పరిష్కరించేందుకు చర్యలకు ఉపక్రమించింది. రైతు భరోసా పంట రుణమాఫీ పేరిట ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. రైతుల వివరాలు నమోదు చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నారు.

ఇదీ జరిగే ప్రక్రియ

రైతు భరోసా యాప్‌ను మండల వ్యవసాయ అధికారులు లాగిన్ చేయాల్సి ఉంటుంది. క్రాప్ లోన్ వేయివర్ ఆప్షన్‌లోకి వెళ్లి దరఖాస్తుదారు తీసుకున్న బ్యాంకు పేరు, బ్రాంచి వివరాలు పొందుపర్చగానే సదరు బ్యాంకులో ఉన్న రైతుల వివరాలు వస్తాయి. ఆ తర్వాత దరఖాస్తుదారు ఆధార్ సంఖ్యను నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు నమోదు చేయాలి. చివరగా వ్యవసాయశాఖ అధికారులు రైతుల కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అనంతరం దరఖాస్తు చేసుకున్న రైతు నుంచి ధ్రువీకరణ పత్రాన్ని వ్యవసాయ అధికారులు తీసుకోనున్నారు. ఇష్టపూర్వకంగానే సమ్మతిని తెలియజేస్తున్నట్లు రైతు సంతకం చేసి అధికారికి ఇస్తే ప్రభుత్వం వివరాలను పరిశీలించనుంది.

ఇంటింటికీ వెళ్లి..

గ్రామాల వారీగా ఇప్పటి వరకు రుణమాఫీ జమ కాని రైతుల ఇళ్లకు అధికారులు నేరుగా వెళ్తున్నారు. వివరాలను పూర్తి స్థాయిలో సేకరిస్తున్నారు. రైతు కుటుంబ సభ్యులతో సహా సంబంధిత అధికారులు సెల్ఫీ తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

అడవిని నరికి.. కొండలు పేల్చి..!

- ఫారెస్ట్ భూముల కబ్జా
- రికార్డుల్లో వేల ఎకరాలు
- మిగిలింది వందల్లోనే..
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



నవల్గ - మర్పల్లి అటవీ ప్రాంతంలో జేసీబీతో చెట్ల తొలగింపు

తాండూరు: నియోజకవర్గ పరిధిలోని అటవీ ప్రాంతంలో గల కొండలను జిలెటిన్ స్టిక్స్ పెట్టి పేల్చి సాగు భూమిగా చదును చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని వందల ఎకరాల అటవీ భూములను కర్ణాటక ప్రాంత రైతులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. తాండూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని పెద్దేముల్, తాండూరు, బషీరాబాద్, బంట్వారం మండలాల్లో 10,880 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. సుమారు రెండు వేల హెక్టార్ల భూమి అన్యాక్రాంతం అయ్యింది. బషీరాబాద్ మండలం ఇస్మాయిల్‌పూర్ - మైల్వార్ మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలో కొంత మంది అక్రమార్కులు చెట్లను నరికి కొండలను జిలెటిన్ స్టిక్స్ పెట్టి పేల్చుతున్నారు. పది రోజుల వ్యవధిలో దాదాపు ఐదు ఎకరాల అటవీ భూములను చదును చేశారు. మరోవైపు నవల్గ - మర్పల్లి మార్గంలో గల అడవిలోని చెట్లను జేసీబీ యంత్రాలతో తొలగించి వ్యవసాయ భూమిగా మారుస్తున్నారు. మైల్వార్ ఇస్మాయిల్‌పూర్ అటవీ ప్రాంతంలో కర్ణాటక వాసులు వందలాది ఎకరాలను కబ్జా చేశారు. అటవీ శాఖ రికార్డుల ప్రకారం బషీరాబాద్ మండలంలో సుమారు 2,900 ఎకరాల అటవీ భూములు ఉన్నాయి. కానీ సగానికి పైగా ఆక్రమణకు గురైనట్లు తెలిసింది. నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వర ఆలయానికి సమీపంలోనే ఈ ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పట్టా భూములంటూ దబాయింపు

మైల్వార్ - ఇస్మాయిల్‌పూర్ అటవీ ప్రాంతంలోని గుట్టలను కొందరు చదును చేస్తున్నారు. వారిని ఎవరైనా ప్రశ్నిస్తే ఇవి పట్టా భూములని వాదిస్తున్నారు. ఈ విషయం ఫారెస్ట్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎఫ్ఆర్ఓ పోస్టు ఖాళీగా ఉండటంతో..

గతంలో తాండూరు అటవీ ప్రాంతంలో తూనిక ఆకుల సేకరించిన కూలీల డబ్బులు పక్కదారి పట్టించిన తాండూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్యాంసుందర్‌రావును రెండు నెలల క్రితం సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో పరిగి రేంజ్ ఆఫీసర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. గత నెలలో ఆయన కూడా బదిలీ అయ్యారు. ఆ తర్వాత ధారూరు అటవీ శాఖ రేంజ్ అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. మరోవైపు తాండూరు రేంజ్ సెక్షన్ ఆఫీసర్లు బదిలీ కావడంతో కొత్తవారు విధుల్లో చేరారు. ఇన్‌చార్జులకు, కొత్తగా వచ్చిన వారికి అటవీ ప్రాంతంపై పూర్తి అవగాహన లేకపోవడంతో పలువురు యథేచ్ఛగా చెట్లను నరికి భూమిని ఆక్రమిస్తున్నారు.

చెట్లను నరికితే కఠిన చర్యలు

మైల్వార్ - ఇస్మాయిల్‌పూర్ అటవీ ప్రాంతంలో చెట్లను నరికి వేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. నేను కొత్తగా విధుల్లో చేరా. అటవీ ప్రాంతం ఎంత మేర ఉంది అనే విషం పరిశీలించాల్సి ఉంది. ఎవరైనా అటవీ భూములను ఆక్రమించినా, చెట్లను నరికినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– స్నేహ, సెక్షన్ ఆఫీసర్, బషీరాబాద్ మండలం



మొలకల బుట్టతో యువతి

వహ్.. తీజ్

కద్తాల్ మండలం గానుగుమార్ల తండాలో గురువారం తీజ్ సంబురాలు అంబరాన్నంటాయి. తొమ్మిది రోజులుగా తండాకు చెందిన యువతులు నియమ నిష్ఠలతో ధాన్యాలతో కూడిన మొలకల బుట్టలను తయారు చేశారు. గురువారం వాటిని ఎత్తుకుని బ్యాండు మేళాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనం సందర్భంగా సంప్రదాయ నృత్యాలు, కేరింతలతో సందడి చేశారు. స్థానిక చెరువులో మొలకల బుట్టలను నిమజ్జనం చేశారు. వేడుకలకు ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఐపీఎస్ మాజీ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు హాజరయ్యారు.

– కద్తాల్



సంబరాల్లో సందడి

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో 14మందికి జైలు
మరో 13 మందికి జరిమానా



జైలుశిక్ష పడిన 14 మంది వాహనదారులు

తాండూరు టౌన్‌: డ్రంకెన్ డ్రైవ్ కేసులో 14 మందికి జైలు శిక్ష పడిందని పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. మద్యం సేవించి వాహనా లు నడిపిన 14మందికి తాండూరు సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నామాల అశోక్ రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. వీరితో పాటుగా మరో 13 మందికి రూ.5వేల నుంచి రూ.వెయ్యి వరకు జరిమానా విధించారన్నారు.

కిరాణ షాపులపై పోలీసుల దాడులు



కిరాణ షాపులో సోదాలు చేస్తున్న పోలీసులు

కొందుర్గు: మండల కేంద్రంలోని కిరాణ, పాన్ షాప్‌లపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు సునీత, బలరాం, కృష్ణయ్య నాలుగు బృందాలుగా ఏర్పడి ఏక కాలంలో దాడులు చేశారు. ఈ దాడుల్లో 20 లీటర్ల మద్యం, రూ.4 వేల విలువైన గుట్కా ప్యాకెట్లు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ



సెల్ ఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ గిరి

పెద్దేముల్: మండల పరిధిలోని అడ్కిచెర్ల గ్రామానికి చెందిన బత్యా పటేల్ మూడు నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ ద్వారా పోలీసులు ఫోన్‌ను గుర్తించారు. ఈ మేరకు గురువారం ఎస్‌ఐ గిరి బత్యాపటేల్‌కు అందజేశారు.

బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న సాధన సంస్థ కార్యనిర్వాహకుడు రాహుల్

ధారూరు: బాల్య వివాహాలను కలిసికట్టుగా నివారిద్దామని సాధన సంస్థ కార్య నిర్వాహకుడు చిక్కు రాహుల్ అన్నారు. గురువారం సాధన, కేఎస్‌సీఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని చింతకుంట ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదామన్నారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు బాల్య వివాహాల ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శివసాగర్, సంస్థ ఆర్గనైజర్లు సంజమ్మ, అంజయ్య, మమత, ఆసిమాబేగం, కరీం, శ్రీనివాస్, కన్యాకుమారి, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేర్చుకున్నదానికి నైపుణ్యం జోడించండి
బ్రేడ్ డైరెక్టర్ నాగరాజు



మాట్లాడుతున్న నాగరాజు

మోమిన్‌పేట: శిక్షణలో నేర్చుకున్నదానికి నైపుణ్యం జోడించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని బ్రేడ్(బ్యాంకర్ల గ్రామీణ అభివృద్ధి సంస్థ) డైరెక్టర్ నాగరాజు అన్నారు. బ్రేడ్ మండల కేంద్రంలో మహిళలకు 45 రోజుల పాటు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇచ్చారు. గురువారం శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరైన నాగరాజు మాట్లాడుతూ.. ఆకర్షించే డిజైన్‌లతో మగ్గం వర్క్ చేసి ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ సత్తయ్య, ట్రైనర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బంగారు త'రుణం'

- గోల్డ్‌లోన్‌తో ఆర్థిక ఇబ్బందులకు ఉపశమనం
- ఆభరణాలు తాకట్టు పెట్టుకుని నిమిషాల్లో నగదు బదిలీ చేస్తున్న బ్యాంకులు
- వ్యవసాయ, వ్యాపార పెట్టుబడులకు వినియోగించుకుంటున్న ప్రజలు



దుద్యాల్: బంగారమంటే ఇష్టపడని వారి ఎవరుంటారు. ఇప్పటి వరకు మహిళలే ఎక్కువగా ఆసక్తి చూపించేవారు. ప్రస్తుతం మహిళలతో పాటు పురుషులు పోటీ పడుతున్నారు. అలంకరణ విషయంగా కాకుండా అత్యవసర సమయంలో ఆదుకుంటుందనే భావనతోనే పసిడి కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు. ఈ ఆభరణాలు సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆర్థిక ఇబ్బందులను తీరుస్తోంది. అత్యవసర సమయంలో నగలను బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకుని జీవితాలను చక్కదిద్దుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు తీరిన తర్వాత బ్యాంకుల్లోని గోల్డును విడిపించుకుంటున్నారు.

వ్యవసాయ రంగానికి తక్కువ వడ్డీ

బంగారు ఆభరణాలపై రుణాలు మంజూరు చేసే అంశంలో బ్యాంకర్లతో పాటుగా ఫైనాన్స్ కంపెనీలు సైతం పోటీ పడుతున్నాయి. దీంతో డబ్బు అత్యవసరమనుకున్న సమయంలో ఆభరణాలు తాకట్టు పెట్టేస్తున్నారు. పంటల పెట్టుబడులకు రైతులు, విద్యార్థుల ఉన్నత చదువులకు తల్లిదండ్రులు, నూతన వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారు సైతం రుణాల కోసం బ్యాంకు మెట్లెక్కుతున్నారు. జాతీయ బ్యాంకులు వ్యవసాయ రంగానికి తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తుండడంతో వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లే వారి సంఖ్య తగ్గిపోయింది. ఆర్థికంగా బలంగా ఉన్నవారు సైతం బంగారంపై లోను తీసుకుని ఇతర రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు.

వాయిదాల చెల్లింపే ప్రధానం

నగల నాణ్యతను పరిశీలించి బ్యాంకర్లు రుణం మంజూరు చేస్తున్నారు. 24 క్యారెట్స్ బంగారమని బ్యాంకు అధికారిక అప్రైజర్ నిర్ధారిస్తే మార్కెట్ విలువపై 90శాతం లోన్‌కు అప్రూవల్ ఇస్తున్నారు. నాణ్యత తక్కువగా ఉంటే 70శాతం వరకు నగదు ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. వాయిదాల చెల్లింపుపై వడ్డీ ఆధారపడి ఉంటుంది.

గడువు మీరితే వేలం

వ్యవసాయ రుణాలు, వాణిజ్య రుణాలు, మధ్యతరగతి ప్రజలు అవసరాలకు తీసుకునే రుణాల ఆధారంగా వాయిదాలు నిర్ణయించి లోన్ ఇస్తున్నారు. ఎక్కువగా మూడు, ఆరు, 12 నెలల వాయిదాపై రుణం తీసుకుంటున్నారు. గడువులోగా అసలు చెల్లించకుంటే మొదట బ్యాంకర్లు నోటీసులు జారీ చేస్తారు. స్పందించని ఎడల సదరు నగలు వేలం వేసి డబ్బు రాబట్టుకుంటారు.

"కాలేజీ ఫీజు కోసం



మా కుతురుకు బీ ఫార్మాసీలో సీటు వచ్చింది. కాలేజీలో చేర్పించేందుకు రూ.50 వేలు అవసరం పడ్డాయి. సమయానికి అంత డబ్బు లేకపోవడంతో ఏపీజీవీబీ బ్యాంకు హకీంపేట శాఖలో బంగారు ఆభరణాలు తాకట్టు రుణం తీసుకున్నా. అత్యవసర సమయంలో బంగారు రుణం తీసుకోవడమే ఉత్తమం.

– పవిత్ర, గృహిణి, బొంరాస్‌పేట

'కోట్‌పల్లి'కి వరద ప్రవాహం

ఆనందంలో ఆయకట్టు రైతులు

ధారూరు: జిల్లాకు తలమానికమైన కోట్‌పల్లి ప్రాజెక్టుకు వరద ప్రవాహం క్రమంగా చేరుతోంది. మరో నాలుగు అడుగుల మేర నీరు వస్తే ప్రాజెక్టు నిండి అలుగుపారనుంది. వర్షాలు పడక దిగాలు చెందిన రైతులు ప్రాజెక్టుకు వరద వస్తుండడంతో ఆయకట్టు ఆనందం వెల్లివిరుస్తోంది. కాగా గతేడాది జూలై 26 వరకు ప్రాజెక్టు పూర్తిగా నిండింది.

చేప చేతికందేనా..?

కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి చేపలు బయటకు వెళ్లకుండా ప్రాజెక్టు సాగునీటి సంఘం సభ్యులు అలుగుకు అడ్డంగా కర్రలను పాతి వలలు ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీరు నిండితే అలుగు ద్వారా కాగ్నానదిలో కలిసిపోతాయి. గతేడాది వరద ఉధృతి కారణంగా అలుగుకు ఐదు అడుగుల ఎత్తులో నీరు పారింది. దీంతో వలలు కొట్టుకుపోయి చేపలు నదిలో కలిశాయి. ఈ కారణంగా సంఘం సభ్యులు తీవ్రంగా నష్టపోయారు.



కోట్‌పల్లి అలుగు వద్ద ఏర్పాటు చేసిన వలలు

విద్యార్థులపై శ్రద్ధ అవసరం

- మైనర్‌లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై కేసు, రూ.5వేల జరిమానా
- ప్రైవేట్ విద్యాసంస్థల సమావేశంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి చిత్రంలో సీఐ సంతోష్

తాండూరు: విద్యార్థులకు క్రమశిక్షణ అలవర్చేందుకు విద్యాసంస్థల ప్రతినిధులు చొరవ తీసుకోవాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం తాండూరు డీఎస్పీ కార్యాలయంలో ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణ సీఐ సంతోష్‌కుమార్‌తో కలిసి డీఎస్పీ అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ఇటీవల మైనర్లు వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారని.. పాఠశాలకు వాహనాలు తీసుకువచ్చే విద్యార్థులపై నిఘా పెట్టాలన్నారు. అటువంటి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సరైన కౌన్సెలింగ్ ఇవ్వాలని చెప్పారు. తీరు మార్చుకోకుంటే మైనర్ తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనం ఇచ్చిన వారికి రూ.5వేల జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపించవద్దని సూచించారు. బాలికలు, మహిళా టీచర్ల రక్షణకు షీ టీమ్ పని చేస్తోందన్నారు. పాఠశాలల వద్ద ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు.

రైలు నుంచి దూకి.. శవమై తేలి!

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

బషీరాబాద్: దైవ దర్శనానికి వెళ్లిన ఓ కుటుంబం గమ్యం చేరకుండానే మార్గమధ్యలోనే విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. నిజామాద్ జిల్లా కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన రెడ్డి రవి(41), హేమ భార్యాభర్తలు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. ఈ నెల 18న తన కుమారులు కేతన్ చౌదరి, కేహిత్ చౌదరితో కలిసి రైలులో తిరుపతికి వెళ్లారు. 20న శ్రీవారిని దర్శించుకుని 21న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. 22 తెల్లవారుజామున నావంద్గీ(బషీరాబాద్) రైల్వే గేటు సమీపంలో రైలు నెమ్మదిగా వెళ్తున్న సమయంలో రవి బోగీ నుంచి దూకి అదృశ్యమయ్యాడు. ఇది గమనించిన హేమ తాండూరు రైల్వే స్టేషన్‌లో దిగి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వికారాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆ రోజు నుంచి బషీరాబాద్ పరిసర ప్రాంతాల్లో అతడి భార్య, బంధువులు జాడకోసం వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో అడవిలో కుళ్లిపోయిన మృతదేహాన్ని గమనించిన పశువుల కాపరి బషీరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు హేమను పిలిపించగా.. తన భర్తేనని బోరున విలపించింది. శవం పూర్తిగా కుళ్లిపోవడంతో ఘటనా స్థలంలోనే వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. రవి మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని బంధువులు, భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని బషీరాబాద్ ఏఎస్‌ఐ నారాయణ తెలిపారు.



తిరుమలలో భార్య, కొడుకుతో మృతుడు రవి (ఫైల్)

న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తాం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పట్టణ కేంద్రంలోని బార్ అసోసియేషన్ భవన్‌లో న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేస్తామన్నారు. బార్ అసోసియేషన్ అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పెళ్లి కార్డులు పంచేందుకు వెళ్లి..
రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడు


పెద్దఅడిశర్లపల్లి: తన స్నేహితుడి సోదరి పెళ్లి కార్డులు పంచేందుకు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం చిల్కమర్రి గ్రామ స్టేజీ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అందుగుల పెద్దతండాకు చెందిన నేనావత్ రాజేష్(19), అదే మండలం పల్లెతండాకు చెందిన తన స్నేహితుడు కేతావత్ సంతోష్ సోదరి పెళ్లి కార్డులు పంచేందుకు నాగార్జునసాగర్ పరిధిలోని నాగార్జున పెంట తండాకు బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో పెద్దఅడిశర్లపల్లి మండలం చిల్కమర్రి స్టేజీ సమీపంలో రాగానే కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న నేనావత్ రాజేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న సంతోష్‌కి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గుడిపల్లి ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని, క్షతగాత్రుడిని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

శంషాబాద్ రూరల్: డబ్బుల విషయంలో భర్తతో గొడవ పడిన మహిళ, తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కవ్వగూడకు చెందిన మంగళారమ్ శేఖర్, మంగమ్మ దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు. మంగమ్మ తన భర్త సోదరుడు జేబులో నుంచి రూ.500 తీసుకుంది. ఈ విషయంలో భార్య, భర్తలు గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఈ నెల 28న ఆటో డ్రైవింగ్ చేయడానికి బయటకు వెళ్లిన భర్తకు మంగమ్మ ఫోన్ చేసి ఇంటికి రమ్మంది. కోపంలో ఉన్న భర్త తాను రాలేనంటూ ఫోన్‌ను కట్ చేశాడు. రాత్రి ఇంటికి వచ్చి చూడగా.. భార్య మంగమ్మ(20), కూతురు ఉషా(4), కొడుకు జగదీష్(1) ఇంట్లో కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా మంగమ్మ ఇంటి నుంచి వెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చిందని భర్త తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

క్షుద్రపూజల కలకలం!

బషీరాబాద్: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. గురువారం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తెలిపిన ప్రకారం.. మూడు రోజులుగా కళాశాల ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, అగరబత్తులతో నిత్యం రాత్రివేళ పూజలు చేస్తుండగా.. ఉదయం కళాశాల స్వీపర్ ఊడ్చేస్తుంది. ఇది గమనించిన లెక్చరర్లు, విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. కళాశాలలో క్షుద్రపూజల ఘటన స్థానికుల్లో సైతం కలవరం సృష్టిస్తోంది. దీనిపై కళాశాల యాజమాన్యం ఆందోళన వ్యక్తం చేస్తూనే గోప్యంగా ఉంచడం గమనార్హం.



కళాశాల ఆవరణలో క్షుద్రపూజల ఆనవాళ్లు

వర్గపోరుతో నిలిచిన అభివృద్ధి



డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న స్వప్న

డ్రైన్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు టౌన్: రాజకీయ వర్గపోరు కారణంగా నాలుగేళ్లుగా తాండూరు మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ అన్నారు. గురువారం ఆమె 25వ వార్డులో రూ.10లక్షల నిధులతో డ్రైన్ నిర్మాణ పనులను కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల ఆలస్యం గురించి మున్సిపల్ వాసులకు అందరికీ అవగాహన ఉందని.. దశల వారీగా ప్రతీ వార్డులో అభివృద్ధి పనులు వేగతవంతం చేశామన్నారు. కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. అనంతరం కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. వార్డు పరిధిలో డ్రైన్ పనులు ప్రారంభించామని.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో మరో రూ.20లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డి, డీఈ మహిపాల్, ఏఈ ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్ కుమార్

తాండూరు టౌన్: పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై కార్యశాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమేశ్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ చేపడుతున్న అభివృద్ధి పనులు, దేశ భద్రత, పేదరిక నిర్మూలన వంటివి చూసి అనేక మంది పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పార్టీని ప్రజలు ఆదరించిన తీరే ఇందుకు నిదర్శనమన్నారు. పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, కార్యదర్శి భద్రేశ్వర్, అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్, కార్యవర్గ సభ్యులు సుదర్శన్ గౌడ్, పట్టణాధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి కిరణ్, కౌన్సిలర్ శ్రీలత, నాయకులు శ్రీనివాస్, కృష్ణ, రాజు, ప్రకాష్, చందు, బిచ్చప్ప, బూత్ అధ్యక్షులు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



కార్యశాలలో మాట్లాడుతున్న రమేశ్ కుమార్

వ్యక్తి బలవన్మరణం



మధు (ఫైల్)

మీర్‌పేట: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం. జిల్లెలగూడ రాఘవేంద్రనగర్‌కు చెందిన మీసమోని మధు (35) మిథానిలో కార్మికుడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. మధు కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

'కల్యాణ లక్ష్మి' చెక్కుల పంపిణీ

దౌల్తాబాద్: కల్యాణ లక్ష్మి పథకం పేదింటి మహిళలకు వరమని కడా అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రావు, వీరన్న, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న కడా అధికారి వెంకట్‌రెడ్డి

గౌరారంలో సినీ సందడి

దుద్యాల్: సినీనటులు మండలంలోని గౌరారంలో గురువారం సందడి చేశారు. సుమన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న శివశంభో సినిమా షూటింగ్ ఇక్కడ చిత్రీకరించారు. కుటుంబ నేపథ్యంగా సాగే చిత్రంగా నిర్మాతలు రాజగోపాల్, చెన్నయ్య తెలిపారు. సినిమాను కార్తీక మాసంలో విడుదల చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. షూటింగ్ కావడంతో సినిమావాళ్లను చూసేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



సుమన్‌కు సీన్‌ను వివరిస్తున్న దర్శకుడు నర్సింగ్



పొలంలో సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న సినిమా యూనిట్

అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు రిమాండ్

పరారీలో మరో ఇద్దరు

- నిందితుల నుంచి రూ.పదివేల రికవరీ

షాద్‌నగర్‌రూరల్: అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ఇద్దరు సభ్యులను షాద్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ రంగస్వామి తెలపిన ప్రకారం.. బెంగుళూరుకు చెందిన గంగాధర్, అనిల్, హన్మంత్‌రాజ్, పృథ్వీరాజ్, అభి అలియాస్ అభిషేక్, శశి ముఠాగా ఏర్పడ్డారు. జల్సాలకు అలవాటు పడిన వారు బెంగుళూరుతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇదే క్రమంలో ఈ నెల 19న కారులో పట్టణానికి చేరుకుని అర్ధరాత్రి ఐదు దుకాణాల్లో చోరీకి పాల్పడి తిరిగి బెంగుళూరు పారిపోయారు. బెంగుళూరులోని సుబ్రమణ్యంపురం ఠాణా పరిధిలో జరిగిన చోరీ విచారణలో భాగంగా అక్కడ పోలీసులు గంగాధర్, అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారు షాద్‌నగర్‌లో దొంగతనం చేసినట్లు ఒప్పుకొన్నారు. బెంగుళూరు పోలీసుల సహకారం, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ముఠాలోని హన్మంత్‌రాజ్, పృథ్వీరాజ్‌లను అదుపులోకి తీసుకున్నారు. అభి, శశి పరారీలో ఉన్నారన్నారు. నిందితుల నుంచి రూ.10వేలు రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు ఛేదించడంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్, సీసీఎస్ సీఐ పవన్, డిటెక్టివ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శరత్‌కుమార్, సిబ్బంది నరేందర్, కృష్ణ, శంకరయ్య, మహేశ్, రాజేశ్, రఫీ చాకక్యంగా వ్యవహరించారని ఏసీపీ వారిని అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి